క్లుప్తంగా

విద్యుత్ సరఫరాలో అంతరాయం

నకరికల్లు: మండలంలోని సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ బి.నాగసురేష్‌బాబు శుక్రవారం తెలిపారు. సబ్‌స్టేషన్‌ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. త్రీఫేజ్ విద్యుత్‌ను శనివారం అర్ధరాత్రి 12గంటల నుంచి ఉదయం 8గంటల వరకు ఇవ్వనున్నట్లు తెలిపారు.

శానిటైజర్స్ అందజేత

సత్తెనపల్లి: ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో మిత్రుడు తొమ్మండ్రు రవి సహాయంతో శుక్రవారం రూ.10 వేలు విలువగల శానిటైజర్స్ అందించారు. కార్యక్రమంలో కొత్త రామకృష్ణ, వైద్యురాలు డాక్టర్ సుమిత్ర, ల్యాబ్ టెక్నీషియన్‌లు ఆలీ, చందు, రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

రేపు రెడ్డి వన సమారాధన

సత్తెనపల్లి: కార్తీక మాసం పురస్కరించుకొని పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల అన్నం గురువమ్మ కృష్ణమూర్తి (ఏజీకేఎం) డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 10న రెడ్డి జనసేవా సమితి ఆధ్వర్యంలో రెడ్డి వన సమారాధన జరుగుతుందని రెడ్డి జనసేవా సమితి నియోజకవర్గ అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ నెల 10న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని, బాలబాలికలకు, మహిళలకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రెడ్డి సోదర సోదరీమణులు కుటుంబ సభ్యులతో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ప్రపంచ దివ్యాంగుల వేడుకలు



ముప్పాళ్ళ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల ప్రత్యేక అవసరాలుగల విద్యావనరుల కేంద్రంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి ఒంగోలు రాజు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల చిన్నచూపు ఉండకూడదన్నారు. అన్ని రంగాల్లోను సమాన అవకాశాలు కల్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో భాగంగా ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ట్రైసైకిల్‌ను అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సీతారామిరెడ్డి, ఉపాధ్యాయులు, ప్రత్యేక అవసరాల కేంద్రం ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జెడ్పీ పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ



అచ్చంపేట: స్థానిక తుమ్మేపల్లి శ్రీరాములు జిల్లా పరిషత్ హైస్కూలు ప్రథమ ఉపాధ్యాయులు ముప్పాళ్ల గోపాలకృష్ణమూర్తి శత జయంతి ముగింపు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం వారి కుమారుడు ముప్పాళ్ళ వెంకటేశ్వర్లు పాఠశాల గ్రంథాలయానికి రూ.20వేలు విలువ చేసే విజ్ఞాన, వినోద, ఆధ్యాత్మిక, సందేశాత్మక పుస్తకాలను విరాళంగా ఇచ్చారు. ఈ సందర్భంగా ముప్పాళ్ళ గోపాలకృష్ణమూర్తి చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు, శిష్య బృందం పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జాతీయ స్థాయి పోటీలకు ఆకుల గణపవరం విద్యార్థిని



రాజుపాలెం: మండలంలోని ఆకుల గణపవరం జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థిని జాతీయ స్థాయిలో నిర్వహించే జిమ్నాస్టిక్స్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుగుణమణి శుక్రవారం తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.యజ్ఞశ్రీ ఇటీవల కాలంలో కాకినాడలో రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జిమ్నాస్టిక్స్ పోటీలలో పాల్గొన్నది. దీంతో యజ్ఞశ్రీ జాతీయ స్థాయిలో ఆడేందుకు ఎంపికై నట్లు తెలిపారు. ఈ నెల 15వ తేదీన ఢిల్లీలో జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలలో పాల్గొంటున్నట్లు తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికై నందుకు యజ్ఞశ్రీని ఉపాధ్యాయులు అభినందించారు.

రైతన్నకు అండగా...

- అధిక వర్షాలు.. వడివడిగా నష్టం అంచనాలు
- క్షేత్రస్థాయిలో పంటల పరిశీలన.. సూచనలు



కట్టమూరులో పంట పొలాలను పరిశీలిస్తున్న ఏడీఏ శ్రీధర్‌రెడ్డి

సత్తెనపల్లి: మిచాంగ్ తుపాను వల్ల ఈదురుగాలులతో వర్షాలు కురిశాయి. మూడు రోజుల పాటు వర్షాలు కురవడంతో పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సత్తెనపల్లి మండలం కట్టమూరు వద్ద ఎద్దువాగు ఉధృతికి నీట మునిగిన వరి, మిరప పంటలను సత్తెనపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.శ్రీధర్ రెడ్డి పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గిన నేపథ్యంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

- వర్షానికి వరిపంట నేలవాలి నీట మునిగితే బూజు తెగులు వల్ల గింజ రంగు మారే అవకాశం ఉంటుంది. కనుక లీటర్ నీటికి ఒక మిల్లీ లీటర్ ప్రొఫికొనజోల్ లేదా ఒక గ్రామ్ కార్బెండిజమ్ లేదా ఒక గ్రాము కార్బెండిజమ్ ప్లస్ మాంకోజెబ్‌ను కలుపుకొని పిచికారీ చేసుకోవాలి.
- కోత కోసి ఒదెలు వర్షానికి తడిచినట్లయితే గింజ మొలకెత్తకుండా ఉండేందుకు ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని ఒదెలపై పిచికారీ చేసుకోవాలి. పొలంలో నీరు నిలిచి ఉన్నట్లయితే ఒదెలను గట్ల పైకి తెచ్చుకొని విడగొట్టి ఉప్పు ద్రావణం చల్లుకోవాలి.
- వరి పంట నీట మునిగినప్పుడు ఎక్కువగా ఉన్న నీరు కాలువల ద్వారా తీసివేయాలి. పంట పడిపోకుండా గుబురుగా దుబ్బులను నిటారుగా ముడివేసి కట్టాలి. దీనివలన గింజ తడవకుండా మొలక రాకుండా కాపాడుకోవచ్చు.
- మెట్ట పంటలైన పత్తి, మిరప పొలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా వేగంగా, సులభంగా వెళ్లి పోయే విధంగా పొలం గట్లలో ఎక్కువ సంఖ్యలో వాలుకు నిలువుగా గండ్లు వేయాలి.
- పత్తిలో మూడవ కోతకు కాయలు విచ్చుకొని పత్తి తీతకు సిద్ధమైన కాయల నుంచి విచ్చుకున్న పత్తిని తీయడం మంచిది.



మాదలలో మిరప పంటను పరిశీలిస్తున్న ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ జనని

- అలాగే పంట నీట మునిగినప్పుడు కాలువల ద్వారా నీటిని తీసివేయాలి. తరువాత 20 గ్రాముల యూరియా లీటర్ నీటికి లేదా 19:19:19 లేదా 13:0:45ను 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.
- మిరపలో తయారైన పచ్చిమిరప, పండుమిరపను పొలాల్లో నుంచి కోసి అధిక వర్షాల నుంచి కాయలు తడవకుండా బూజు పట్టకుండా కాపాడుకోవచ్చు.
- శనగలో పంట నీట మునిగినప్పుడు వర్షపు నీరు తీసివేసి సీఎఫ్ 2.5 గ్రాములు లేదా టెబుకోనమజోల్ రెండు ఎంఎల్ లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయడం వలన పంటను కాపాడుకోవచ్చు.



నాగిరెడ్డిపాలెంలో వరి పంటను పరిశీలిస్తున్న తహశీల్దార్ క్షమారాణి, ఏవో

- ముఖ్యంగా ఉద్యాన పంటల్లో పంట నీట మునిగినప్పుడు ఎక్కువ నీరు తీసివేయాలి. అరటి చెట్లు పడిపోకుండా ఉండే విధంగా ప్రోప్పింగ్ చేసుకోవాలి. పండ్ల మొక్కలు, కూరగాయల పంటలకు యాంత్రీకరణ వలన పంట నష్టం తగ్గించవచ్చు.
- పంట నీట మునగడం వలన లేదా అధిక తేమ శాతం వలన పంటల్లో సూక్ష్మధాతు లోపాలు కనిపిస్తాయి. దీని నివారణకు వర్షాలు తగ్గినవి కనుక మైక్రో న్యూట్రిన్ స్ప్రే చేయాలని సూచిస్తున్నారు.

తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన పంటల పరిశీలన

బెల్లంకొండ: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతీ ఒక్క రైతుకు ప్రభుత్వం నుంచి పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ క్షమారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగిరెడ్డిపాలెం, నందిరాజుపాలెం గ్రామాలలో తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులతో కలసి పరిశీలించారు. నష్ట పోయిన ప్రతీ రైతుకు ప్రభుత్వం ద్వారా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల వారీగా గ్రామ స్థాయి టీమ్స్ ఏర్పాటు చేసి, పంట నష్టం అంచనాలను వేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి కృష్ణయ్య మాట్లాడుతూ రైతులు వరి పొలాల్లో నిలిచిపోయిన నీటిని తొలగించి, 4 నుంచి 5 దుబ్బులు కలిపి కట్టడం వలన గింజ నాణ్యత బాగుంటుందని తెలిపారు. 5శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగిరెడ్డి హనుమాయమ్మ, ప్రతాపరెడ్డి, వీఆర్వో వెంకయ్య, వీఏఏ అయ్యప్ప పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

మాదల(ముప్పాళ్ళ): అధికంగా కురిసిన వర్షాలతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉంటే పంట దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందని, వెంటనే యాజమాన్య పద్ధతులు పాటించాలని సత్తెనపల్లి ఉద్యానవనశాఖాధికారి సీహెచ్ జనని చెప్పారు. మండలంలోని మాదల, తొండపి గ్రామాల్లో ముంపునకు గురైన మిరప, పసుపు పొలాలను శుక్రవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. మిరపలో అధిక తేమ వలన వేర్ల ద్వారా మొక్క అవసరమైన పోషకాలు తీసుకోలేదన్నారు. మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చుతాయన్నారు. పంటలకు తెగుళ్ళు ఆశించడమే కాకుండా సూక్ష్మధాతులోపాలు కూడా ఎక్కువగా కనబడే అవకాశం ఉంటుందన్నారు. వాలిపోయిన మొక్కను నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలన్నారు. యాజమాన్య పద్ధతుల ద్వారా నేల అదునుకు వచ్చిన వెంటనే గొర్రుతో అంతరకృషి చేసినట్లయితే త్వరగా ఆరుతుందన్నారు. పైపాటుగా ఎకరానికి 50కిలోల యూరియా, 25కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 200కిలోల వేపపిండి వేసుకోవాలని సూచించారు. అవసరాన్ని బట్టి సూక్ష్మపోషకాలు వారం రోజుల్లో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక ఆదాయం

రైతుసాధికార సంస్థ ఈడీ శామ్యూల్‌ఆనంద్



నార్నెపాడులో ఏటీఎం విధానంలో సాగుచేసిన పంటలను పరిశీలిస్తున్న శామ్యూల్, అమలకుమారి

నార్నెపాడు(ముప్పాళ్ళ): ప్రకృతి వ్యవసాయ విధానంలో వేసిన ఏ గ్రేట్ మరియు ఏటీఎం మోడల్స్ ద్వారా రైతులకు అధిక ఆదాయం లభిస్తుందని ఇండోజర్మన్ గ్లోబల్ ఆగ్రో ఏ క్లాసికల్ రీసెర్చ్ లెర్నింగ్ ఇన్‌స్టిట్యూట్(ఇగ్రాల్), రైతుసాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శామ్యూల్‌ఆనంద్ చెప్పారు. మండలంలోని నార్నెపాడు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ విధానంలో వేసిన పలు రకాల పంటలను జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారితో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఏ గ్రేడ్ విధానంలో ఒక ఎకరా విస్తీర్ణంలో ఐదు రకాల పంటలను సాగు చేయడం వలన అధిక ఆదాయం పొందవచ్చన్నారు. అదేవిధంగా ఏటీఎం మోడల్‌లో పలు రకాల పంటల నుంచి ఆదాయం లభిస్తుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేసిన పొలాల్లో రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు వాడకపోవటం వలన మొక్కలు తుఫాన్‌లను కూడా తట్టుకునే స్వభావాన్ని కలిగి ఉంటాయన్నారు. ఏటీఎం విధానంలో దుంపజాతి మొక్కలు ముల్లంగి, బీట్‌రూట్, క్యారెట్, ఆకుకూరలు చుట్టూ తీగజాతి మొక్కలు బెడ్లకి అంచుల్లో గోరుచిక్కుడు, టమాటా, వంగ లాంటివి వేసుకోవడం వలన నిరంతర ఆదాయం వస్తుందన్నారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయవిధానంలో ఏటీఎం తరహాలో సాగు చేసుకోవాలన్నారు. ఘనజీవామృతం వాడకం వలన తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు. డీపీపీ భవానిరాజ్, ఎన్ఎఫ్ఏ నందకుమార్, మధుబాబు, రైతులు పాల్గొన్నారు.

వరి పంటను కాపాడుకోండిలా..

ఏవో వేణుగోపాల్



నీట మునిగిన వరిని పరిశీలించి సూచనలు చేస్తున్న ఏవో వేణుగోపాల్

అందుకూరు(క్రోసూరు): మిచాంగ్ తుఫాన్ వర్షానికి మండలంలోని అందుకూరు, బాలెమర్రు గ్రామాల్లో నీట మునిగిన వరి పంటలను ఏవో వేణుగోపాల్ శుక్రవారం సందర్శించి అక్కడి రైతులకు వరి పంట కాపాడుకొనేందుకు సూచనలు చేశారు. తుఫాన్ ప్రభావంతో వాగు వెంబడి నీట మునిగిన పొలాల్లో నీరు అంతా బయటకు పంపించివేయాలన్నారు. వాలిపోయిన పంటలను దుబ్బులుగా కట్టాలని చెప్పారు. నీరు బయటకు పంపిన తరువాత 5 శాతం ఉప్పు ద్రావణం (లీటరు నీటికి 50 గ్రాములు) కలిపి పిచికారీ చేయాలన్నారు. ఈ విధంగా రైతులందరూ తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

కౌలురైతులను ఆదుకోండి



పెసర పంటను పరిశీలిస్తున్న కౌలురైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ తదితరులు

అమరావతి: మండల పరిధిలోని పలు గ్రామాలలో తుఫాన్ కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను కౌలు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమన మాట్లాడుతూ తుఫాన్ వల్ల కురిసిన భారీ వర్షాలకు నరుకుళ్లపాడు, పెదమద్దూరు వాగులు పొంగి పొర్లడంతో రబీలో వేసిన కంది, మినుము, శనగ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. ఫసల్ బీమా పథకంలో ప్రీమియంలో 1.5శాతాన్ని ప్రభుత్వమే చెల్లించి ఉచిత పంటల బీమా అమలుచేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు ఎక్కడా చెల్లించలేదన్నారు. ఉచిత పంటల బీమా ద్వారా పూర్తిగా నష్టపోయిన పొలాలకు వెంటనే బీమా పరిహారంలో 25శాతం చెల్లిస్తామని పీఎంఎఫ్‌బీవైలో చెప్పినా ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. రైతుల అభ్యర్థనలను పరిగణలోకి తీసుకొని వారి సమక్షంలో పంటపొలాలను సందర్శించి నష్టపోయిన పొలాలను గుర్తించాలి. కౌలు రైతుల పేర్లను నమోదు చేయాలన్నారు. కొద్ది పాటి వర్షాలకు కూడా వాగులు పొంగి పంట పొలాలను దెబ్బతీస్తున్నాయని వాగులలలో పూడికను తొలగించాలన్నారు. కౌలు రైతులకు జరిగిన నష్టాన్ని పరిగణలోకి తీసుకొని ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సూరిబాబు, రాజు, మొహిద్దీన్‌వలి, నవీన్, రఫీ పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

ఎరువుల డీలర్లకు వ్యవసాయశాఖ హెచ్చరిక



ఎరువుల షాపులో స్టాక్ వివరాలు పరిశీలిస్తున్న ఏవో వేణుగోపాల్

క్రోసూరు: తుపాను వర్షాలు నేపథ్యంలో రైతుల అవసరాలను అడ్డుపెట్టుకుని ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మండల వ్యవసాయఅధికారి వి.వేణుగోపాల్ శుక్రవారం అన్నారు. మండలంలోని పలు ఎరువుల దుకాణాలు తనిఖీలు చేసిన సందర్భంగా ఏవో మాట్లాడుతూ తుపాను వర్షాల కారణంగా రైతులు విరివిగా రసాయనిక ఎరువులు వాడేందుకు సంసిద్ధత చూపుతున్నట్లు చెప్పారు. దీనిని ఆసరాగా తీసుకుని ఎరువులను అధికంగా ధరలకు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎరువులు కొనేటప్పుడు రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. రైతులు తాము కొనుగోలు చేసిన ఎరువుల తాలూకా బిల్లును విధిగా తీసుకోవాలన్నారు. ఎరువుల డీలర్లు రైతులకు అవసరం లేని ఎరువులను అమ్మరాదన్నారు. ఎరువుల బస్తాపై ముద్రించిన గరిష్ఠ ధరకు మించి విక్రయించకూడదన్నారు. రైతులు ఎరువులు కొనుగోలు చేసిన షాపులో ఈ పాస్ మిషన్‌లో వేలి ముద్రవేసి తీసుకోవాలన్నారు. ఎరువుల డీలర్లు ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఏవో, క్రోసూరు 8331056937 నెంబరుకు ఫిర్యాదు చేయాలన్నారు.

ఓటరు నమోదులో లోపాలుంటే సరిదిద్దండి

చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి. వసంతబాబు



సమీక్ష చేస్తున్న వసంతబాబు, పక్కన తహసీల్దార్ కుటుంబరావు

యడ్లపాడు: ఓటరు నమోదులో లోపాలుంటే తక్షణమే సరిదిద్దుకోవాలని చిలకలూరిపేట నియోజకవర్గ ఎన్నికల అధికారి జి. వసంతబాబు అధికారుల్ని ఆదేశించారు. ఆయన శుక్రవారం యడ్లపాడు తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. తహసీల్దార్ వై.వి.బి. కుటుంబరావుతో కలసి బీఎల్‌వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 2,3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపుల్లో వచ్చిన దరఖాస్తుల్ని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలిపారు. కచ్చితమైన ఓటర్ల జాబితా రూపకల్పన లక్ష్యంతో బూత్‌లెవల్ అధికారులు పనిచేయాలని సూచించారు. యువ ఓటర్ల చేరిక, డెత్ ఓటర్ల తొలగింపు తదితర అంశాలపై బీఎల్‌వోలతో సమీక్షించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదు, విజ్ఞప్తికీ పరిష్కారం చూపిస్తున్నట్లు వెల్లడించారు. ఓట్ల చేరిక, తొలగింపు, సవరణకు సంబంధించి వచ్చే అన్ని అర్జీలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేస్తున్నామని తెలిపారు. డబల్ ఎంట్రీ, మృతుల ఓట్లు పూర్తిగా తొలగించామని, అవాస్తవమైన ఆరోపణల్ని నమ్మవద్దని చెప్పారు.

అవకతవకలులేని ఓటరు జాబితా బీఎల్‌వోల బాధ్యత

నరసరావుపేట: అవకతవకలులేని ఓటరు జాబితా బూత్‌లెవల్ అధికారుల(బీఎల్‌వో) బాధ్యతని నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో ఎం.శేషిరెడ్డి తెలిపారు. అవతవకలకు పాల్పడితే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ బంగ్లాలోని కార్యాలయంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. డబుల్‌ఎంట్రీలు, చనిపోయిన ఓటర్ల విచారణ గురించి ఆయన తెలియజేశారు. డివిజనల్ పరిపాలన అధికారి చంద్రారెడ్డి ఫారం-6, అర్జీల విచారణ, నోటీసుల గురించి వివరించారు. కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారి, మున్సిపల్ కమిషనర్ ఎం.రామ్మోహన్ పాల్గొన్నారు.

నేడు లోక్ అదాలత్

పిడుగురాళ్ల: పట్టణంలోని జూనియర్ సివిల్ కోర్టునందు లోక్ అదాలత్ నిర్వహించటం జరుగుతుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఎం.మురళీగంగాధర్‌రావు తెలిపారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించే విధంగా పోలీసులు, బార్ అసోసియేషన్ సభ్యులు చూడాలని తెలియజేశారు. అలాగే పిడుగురాళ్ల కోర్టు పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ కేసులను సామరస్యపూర్వకంగా రాజీచేసుకొని సత్వర న్యాయం పొందాలని విజ్ఞప్తి చేశారు.

పాస్టర్లు ఐకమత్యంగా ఉండాలి

గురజాల : పాస్టర్లు అందరూ ఐకమత్యంగా ఉండాలని నియోజకవర్గ పాస్టర్లు అసోసియేషన్ అధ్యక్షుడు చందాల మరియదాసు అన్నారు. దాచేపల్లిలోని లూథరన్ చర్చిలో శుక్రవారం నియోజకవర్గ స్థాయి పాస్టర్ల అసోసియేషన్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చందాల మరియదాసు, గౌరవ అధ్యక్షులుగా రెవ.ఆదూరి మానిలావ్, కాటిపల్లి డేవిడ్‌రాజు, దేవసహాయం, బాసిపోగు సాగర్ బాబు, కె.మెహెబ్కెలు, మెంబర్లుగా ఐ.పాల్, జక్కరయ్య నాయక్, వరప్రసాద్, అనిల్‌కుమార్, సుధీర్ బాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నుకోబడిన సంఘ సభ్యులను పలువురు అభినందించారు.

దివ్యాంగులకు ట్యాబ్‌ల పంపిణీ

రొంపిచర్ల: స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈవో బ్రహ్మేశ్వరరావు హాజరయ్యారు. సమగ్ర శిక్షణ ద్వారా దివ్యాంగులకు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల్ని ఆయన వివరించారు. శిక్షణ పొందిన చెవిటి, మూగ పిల్లలకు రూ.50 వేల విలువ చేసే ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం సుభాని, ఒకుళాదేవి, శ్రీనివాసరావు, ఎన్. నాగరాజు, ఐఈఆర్ టీచర్ సురేష్ కుమార్, డి. నిర్మల పాల్గొన్నారు.

పంచాయతీల పాలన విధానంపై శిక్షణ

బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్స్‌కు శుక్రవారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ పాలన విధానాలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శుల విధులు, సమావేశాల నిర్వహణ, గ్రామసభల్లో పాటించాల్సిన నియమ నిబంధనలు, పనితీరు గురించి వివరించారు. పంచాయతీలు సొంత ఆదాయ వనరులు సమకూర్చుకోవడంపై ప్రత్యేకంగా వివరించారు. శిక్షకులుగా ఎ.వి.పాండురంగారావు, డి. శ్యామలాదేవి వ్యవహరించారు.

వైభవంగా కనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

శావల్యాపురం: మండల కేంద్రమైన శావల్యాపురంలో గల శ్రీకనకదుర్గమ్మ ఆలయ 22వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు రావిపాటి సాయి భరత్ సారథ్యంలో ఉత్సవ విగ్రహాల్ని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. దంపతులతో విశేష పూజలు చేయించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రెడ్డి జ్వాలా నరసింహారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ముదిరాజులంతా ఐక్యంగా ఉండాలి

ముదిరాజు సంఘ రాష్ట్ర నాయకులు గుడారి నాని



అచ్చంపేట: ముదిరాజులంతా ఐక్యంగా ఉండాలని, జనాభా ప్రాతిపదికన తమకు అందాల్సిన ఫలాల సాధనకై పోరాడాలని, మేలు చేసే పార్టీలకు అండగా ఉండాలని ముదిరాజు సంఘ రాష్ట్ర నాయకులు గుడారి నాని పిలుపునిచ్చారు. మండల ముదిరాజుల సంఘం ఆధ్వర్యంలో మండలంలోని పవిత్ర నీలకంఠేశ్వరస్వామివారి దేవాలయంలో శుక్రవారం జరిగిన కార్తీక వనసమారాధనలో ఆయన ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అచ్చంపేట నుంచి స్వామివారి దేవాలయం వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. స్వామివారి దేవాలయం వద్ద ముదిరాజులనుద్దేశించి ఆయన మాట్లాడారు. వివక్ష లేకుండా ఎవరైతే మనకు ప్రాధాన్యతనిస్తారో వారికే మద్దతు పలకాలన్నారు. ఐక్యతతో లక్ష్యసాధనకు కృషిచేయాలన్నారు. ముదిరాజులుకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఆర్థిక చేయూత నివ్వాలని కోరారు. కొండూరు, రోకటిగుంటవారిపాలెం, అచ్చంపేట, చిగురుపాడు తదితర గ్రామాల నుంచి భారీ సంఖ్యలో ముదిరాజులు వచ్చారు. కార్యక్రమంలో సంఘ నాయకులు చొప్పరపు రామయ్య, యల్లమంద, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ముప్పాళ్ళ: రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీ కొన్న ప్రమాదంలో ఇరువురికి గాయాలైన ఘటన మండలంలోని ఇరుకుపాలెం సమీపంలో శుక్రవారం జరిగింది. ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రాజుపాలెం మండలం గణపవరంకు చెందిన నంబుల పిచ్చయ్య తన ద్విచక్రవాహనంపై భార్య, కుమారుడితో కలిసి మాదల నుంచి గణపవరంకు బయలుదేరాడు. ఈ క్రమంలో దమ్మాలపాడు గ్రామానికి చెందిన యంపరాల కృష్ణ ద్విచక్రవాహనంపై సత్తెనపల్లి వైపు నుంచి వస్తూ ఇరుకుపాలెం సమీపంలో పిచ్చయ్య వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పిచ్చయ్య, కృష్ణకు గాయాలవటంతో చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు.

నష్టపోయిన పంటలకు ప్రాథమిక అంచనాలు



రాజుపాలెం: మండలంలో తుఫాన్ వలన నష్టపోయిన పంటలను వ్యవసాయాధికారులు, ఉద్యాన అధికారులు రెండు రోజులు తిరిగి పరిశీలించి ప్రాథమిక సమాచారాన్ని శుక్రవారం తెలిపారు. 825 ఎకరాల వరి పంట నీట మునిగిందని, 75 ఎకరాల మొక్కజొన్న దెబ్బతిన్నట్లు, వంద ఎకరాల శనగ పంటకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. అదే విధంగా 120 ఎకరాలలో టమాటా, 55 ఎకరాలలో అరటి తోటలు, 20 ఎకరాలలో మునగ తోటలు పూర్తిగా దెబ్బతిన్నట్లు అంచనావేశారు. 550 ఎకరాల మిర్చి పంట నీటమునిగినట్లు తెలిపారు. ఈ సమాచారాన్ని జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. జిల్లా ఉన్నతాధికారుల నుంచి సమాచారం వచ్చిన వెంటనే పూర్తి సమాచారాన్ని అందిస్తామన్నారు.

మొసలిని బంధిస్తాం

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పురుషోత్తమరాజు

నకరికల్లు: ప్రజలకు ప్రాణహాని కలగకుండా మొసలిని పట్టుకొని వన్యప్రాణుల సంరక్షణ కేంద్రానికి తరలిస్తామని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పురుషోత్తమరాజు తెలిపారు. సాక్షి దినపత్రికలో నకరికల్లు వద్ద మొసలి సంచారం అంటూ శుక్రవారం ప్రచురితమైన కథనానికి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు స్పందించారు. తహసీల్దార్ కె.నగేష్ సూచనల మేరకు నకరికల్లులోని రైల్వేట్రాకు వద్ద మొసలి సంచరిస్తున్న ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొసలి సంచరిస్తున్న గుర్తుల ఆధారంగా ఎక్కడ నుంచి ఎక్కడకు తిరుగుతుందని ముందుగా పసిగట్టి సరైన ప్రదేశంలో బోనుపెట్టి మొసలిని బంధిస్తామన్నారు. అప్పటివరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.